మతోన్మాదుల దాడులను అడ్డుకోవాలి

- ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులను శిక్షించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



భారతదేశం లౌకిక రాజ్యమని, మత సామరస్యం కలిగిన దేశంలో మతోన్మాదుల దాడులను లౌకిక శక్తులు అడ్డుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. పరమత సహనం కలిగిన చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై జరిగిన దాడిని సిపిఎం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. దళితులకు దేవాలయంలోకి ప్రవేశం కల్పించిన గొప్ప లౌకికవాది రంగరాజన్ అని, ఆయనపై మతోన్మాదులు కక్షగట్టి దాడులు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పరిధిలోని చిలుకూరి బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌ను సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీతో కలిసి రాష్ట్ర బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా రంగరాజన్‌పై జరిగిన దాడి గురించి ఆరా తీశారు. పూజారికి మద్దతు తెలిపి, అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాన్‌వెస్లీ మాట్లాడారు. చిలుకూరు టెంపుల్‌కు ఓ ప్రత్యేకత ఉందని, ఇక్కడ మతసామరస్యంతో కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇక్కడి ప్రధాన అర్చకులు రంగరాజన్‌కు కూడా ప్రత్యేకత ఉందని, ప్రజాస్వామ్యవాది, పరమత సహనం కలిగిన వ్యక్తిపై మతోన్మాదులు దాడి చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు.కెవిపిఎస్ ఆధ్వర్యంలో కులాల మధ్య అంతరాలను తొలగించాలని చేపట్టిన పోరాటాలకు ఊతం ఇచ్చేలా రంగరాజన్ దళితులను ప్రోత్సహించి, వేదాలు నేర్పించారని గుర్తు చేశారు. దళితులకు దేవాలయ ప్రవేశం కోసం కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ఇలాంటి లౌకిక వాదులను టార్గెట్‌గా చేసుకుని దేశంలో మతోన్మాదులు దాడులకు పాల్పడుతున్నారన్నారు. రంగరాజన్‌పై దాడికి పాల్పడిన వ్యక్తులపై ప్రభుత్వ కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇప్పటికే కొందరిపై చర్యలు తీసుకున్నట్టు తెలిసిందని.. కానీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి మూడు నెలల్లోనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. ఎవరైనా మతపరమైన కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే తప్పులేదని, కానీ ఇతరులపై ఉన్మాద చర్యలకు పాల్పడితే తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇలాంటి ఘటనలను వ్యతిరేకిస్తూ.. ప్రజలను చైతన్యవంతం కల్పించేందుకు లౌకిక శక్తులు ముందుకు రావాలన్నారు. ఇందుకు సిపిఎం ముందు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు హిమబిందు, ఆశయ్య, శ్రీరాంనాయక్, నాయకులు కోట రమేష్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, సామెల్, జగదీష్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాశ్ కారత్, నాయకులు అల్లి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో నైతిక విలువలు పాటించాలి

- కులాల మధ్య విద్వేషాలు పెంచేలా మాట్లాడొద్దు
- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుఖేందర్‌రెడ్డి

'అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడటం మంచిది కాదు.. రాజకీయాల్లో నైతిక విలువలు పాటించాలి' అని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా తెలంగాణలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల గణన సర్వే నిర్వహించడం చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. ఈ సర్వేలో 97 శాతం మంది ప్రజలు తమ వివరాలను నమోదు చేసుకున్నారని తెలిపారు. ఓటర్ల జాబితా ఆధారంగా సర్వే లెక్కలు సరిగ్గా లేవు అనడం కరెక్ట్ కాదన్నారు. ఓటర్ లిస్ట్‌కి, సర్వే లెక్కలకు తేడా ఉంటుందని, ఒక వ్యక్తి రెండు చోట్లా ఓటు హక్కు కలిగి ఉన్నారని అన్నారు. ఓటర్ లిస్ట్ ఆధార్‌కి అనుసంధానం చేస్తే కరెక్ట్‌గా లెక్కలు వచ్చేయన్నారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం సర్వే లెక్కలు తప్పుల తడఖా అని విమర్శలు చేయడం సబబు కాదన్నారు. ప్రభుత్వం చేసిన కృషిని ఏ పార్టీ వారైనా అభినందించాలన్నారు. మూడు లక్షల కుటుంబాలు సర్వే అధికారులకు వివరాలు ఇవ్వలేదన్నారు. వారు కూడా ఇప్పుడు వివరాలు ఇవ్వొచ్చన్నారు.

పది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల కోసం లబ్దిదారులు ఎదురు చూస్తూనే ఉన్నారని, ఇచ్చిన మాట ప్రకారం ప్రస్తుత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇచ్చేందుకు చర్యలు తీసుకుందని అన్నారు. అలాగే, బిపిఎల్, ఎపిఎల్ కార్డులు ఇవ్వాలని తాను ముఖ్యమంత్రికి లేఖ రాశానని, సిఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆ కార్డులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీం కోర్టు ప్రకటనపై తానేమీ మాట్లాడనన్నారు. రాజకీయాలకు తనకు సంబంధం లేదన్నారు. కుల, మతాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఎవరు మాట్లాడినా అది తప్పేనని, బిసిలు, అగ్ర కులాల మధ్య విద్వేషాలు పెంచే విధంగా మాట్లాడటం కరెక్ట్ కాదన్నారు. మదర్ డెయిరీ ఆస్తులు అమ్మడం సరికాదని, ఆస్తి అమ్మడమే పరిష్కారం కాదని, ఇతర మార్గాల ద్వారా సంస్థను కాపాడుకోవాలని సూచించారు

గంజాయి, డ్రగ్స్ అమ్మేవారిపై కఠిన చర్యలు

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గంజాయి, డ్రగ్స్ అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని అబ్కారీ భవన్‌లో ఎక్సైజ్ స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీగా చేయాలని రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు అందరూ నిబద్ధతతో పని చేయాలంటూ సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి అమ్మకాలు తగ్గుముఖం పట్టినా జీహెచ్‌ఎంసీ పరిధిలో అక్కడక్కడా దందా సాగుతోందని పేర్కొన్నారు. ధూల్‌పేట, శేర్‌లింగంపల్లి ప్రాంతంలో అమ్మకాలను కట్టడి చేయడంతో గంజాయి ముఠాలు నగర శివారు ప్రాంతాలను ఎంచుకుంటున్నాయని అన్నారు. గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై ఎస్‌టీఎఫ్ సిబ్బంది తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై సీరియస్‌గా ఉందనీ, ఆ క్రమంలో ఎవ్వరినీ ఉపేక్షకుండా దాడులు నిర్వహించాలని ఎక్సైజ్ శాఖ అధికారులను అదేశించారు. వీటి కట్టడికి దందా నడుస్తున్న ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఖురేషి, అసిస్టేంట్ కమిషనర్ ప్రణవీ, అడిషనల్ ఎస్‌పి భాస్కర్‌తోపాటు ఎస్‌టీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌లపై తనిఖీలు చేపట్టండి

- కలెక్టర్లకు సిఎస్ శాంతి కుమారి ఆదేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఇసుక రీచ్‌లు, స్టాక్ యార్డులను తనిఖీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక అందుబాటులో ఉంచేందుకు మంగళవారం సచివాలయంలో మైనింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మంచిర్యాల, కరీంనగర్ జిల్లాల కలెక్టర్లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్మాణంలో ఉన్న ఇండ్లకు సరిపడ ఇసుక అందుబాటులో ఉండేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి ఇసుక రీచ్‌లు, స్టాక్‌యార్డులు, ఇసుక రీచ్‌ల ప్రవేశ, నిష్క్రమణ పాయింట్లను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రధాన ఇసుక మార్కెట్లకు వెళ్లే రహదారులను గుర్తించి, పోలీసు, రవాణా శాఖ అధికారులతో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. రీచ్‌లు, స్టాక్‌యార్డుల నుంచి అనధికారికంగా ఇసుకను తరలించకుండా 24 గంటలు సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిపి జితేందర్, ఇంటెలిజెన్స్ డీజీ. బి.శివధర్‌రెడ్డి, ఎడిజిపి మహేష్ భగవత్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్, హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్, డిఎంజి శశాంక, టిజిఎండిజి ఎండి సుశీల్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణ లోపాలను సవరించండి

- 1, 2, 3 గ్రూపులుగా కాకుండా ఎబిసిడిలుగా వర్గీకరించాలి
- రేవంత్‌రెడ్డికి మందకృష్ణ విజ్ఞప్తి
- అభ్యంతరాలుంటే ఉపసంఘానికి, కమిషన్‌కు తెలపండి : సిఎం సూచన

సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్న మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణలోని లోపాలను సవరించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం సిఎం రేవంత్‌తో పాటు మంత్రి వర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన భేటీ అయ్యారు. అనంతరం మందకృష్ణ మీడియాతో మాట్లాడారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికపై ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసినట్టు తెలిపారు. "సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన వెంటనే ఎస్‌సి వర్గీకరణ చేశారు. ఇందులో సిఎం భాగస్వామ్యం అయ్యారు. అందుకే ధన్యవాదాలు తెలిపాం. అయితే, జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికలో కొన్ని లోపాలున్నాయి. ఎస్‌సిలను 1,2,3 గ్రూపులుగా కాకుండా ఎబిసిడిలుగా వర్గీకరించాలి. ఎస్‌సిలలో అత్యధికంగా మాదిగలు ఉన్నారు. ఎస్‌సి వర్గీకరణలో ప్రభుత్వం ఆమోదించిన నివేదికలో లోపాలను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలి "అని విజ్ఞప్తి చేశారు. ఎస్‌సి వర్గీకరణలోని లోపాలపై ఆయన ప్రభుత్వానికి లేఖ రాశారు.

"ఎస్‌సి రిజర్వేషన్ల కేటాయింపులో గానీ, ఏ కులాలను, ఏ గ్రూపులలో చేర్చాలనే విషయంలో గానీ నిష్పక్షపాతమైన, శాస్త్రీయతను పాటించలేదు. వర్గీకరణలో గ్రూపు-1లో ఉన్న కులాలకు ఒక శాతం రిజర్వేషన్ కేటాయించడానికి తగిన జనాభా లేనప్పటికీ వెనుకబాటుతనం ప్రాధాన్యతగా తీసుకున్నారు. ఎస్‌సి కులాల్లో అత్యధిక జనాభా (62శాతం) ఉండి, అన్ని రంగాల్లో వెనుకబడిన మాదిగ కులానికి తొమ్మిది శాతం కేటాయించడం ముమ్మాటికి అన్యాయమే. రెండో స్థానం(29శాతం)లో ఉన్న మాల కులానికి జనాభా నిష్పత్తి కంటే ఎక్కువ (5శాతం) కేటాయించారు. గ్రూపు -1 లో పేర్కొన్న మన్నె, కొలుపుల వాండ్లు, పంబాడ, పంభాలా, ముండాల, సంబన్, కులాలు గతంలో లబ్ది పొందినందున వారిని గ్రూప్-3లో చేర్చాలి" అని సిఎంకు మందకృష్ణ రాసిన లేఖలో సూచించారు. "గ్రూపు-2లోని ఎల్లమ్మల్వార్, ఎలమ్మలవాండ్లు, పంచమ, పరయ కులాలను తిరిగి గ్రూప్-3 లో చేర్చాలి. గ్రూప్-3 లో పేర్కొన్న ధోర్ కులాన్ని, ప్రస్తుతం గ్రూప్-1 లో చేర్చిన మాంగ్ గరోడి కులాన్ని గ్రూప్-2 లో చేర్చాలి. గ్రూప్-3లో ఉన్న పాకి, మోటి, తోటి, రెల్లి కులాలను గ్రూప్-1 లో ఉంచాలి. నేతకాని, మహర్, హోలియదాసరి వంటి మరికొన్ని కులాలను కలిపి గ్రూప్-3గా ఏర్పాటు చేయాలి. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అత్యంత ప్రయోజనాలు పొందిన మాల, ఇతర కులాలన్నింటిని కలిపి గ్రూప్-4 గా ఏర్పాటు చేయాలి" అని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్‌సి రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం నాలుగు గ్రూప్‌లుగా (ఎబిసిడి) వర్గీకరించాలనీ, ఒక వేళ వెనుకబాటుతనం ఆధారంగానే వర్గీకరణ చేస్తే ఆ సూత్రాన్నే గ్రూపు -1, గ్రూపు -2 గ్రూప్ 3 లకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు ఎస్‌సి వర్గీకరణపై అభ్యంతరాలుంటే మంత్రి వర్గ ఉపసంఘంతో పాటు కమిషన్‌కు తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మందకృష్ణ మాదిగకు ఈ సందర్భంగా సూచించారు.

సిఎంకు అండగా ఉంటా...మందకృష్ణ

ఎస్‌సి వర్గీకరణ ప్రక్రియను ఒక కమిట్‌మెంట్‌తో చేపట్టిన ప్రభుత్వానికి, సిఎం రేవంత్‌రెడ్డి ఒక సోదరుడిగా అండగా ఉంటానని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అనంతరం మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, ఎస్‌సి ఉపకులాల వర్గీకరణపై సిఎం రేవంత్ రెడ్డి కమిట్‌మెంట్‌ను అభినందించారు. వర్గీకరణలో పలు సమస్యలను సీఎంకు వివరించారు. రాజకీయ ప్రయాజనాలకు అతీతంగా, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే మంచి లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉందని సిఎం స్పష్టం చేశారు. అసెంబ్లీలో చర్చించి, కేబినెట్ సబ్ కమిటీ వేసి, న్యాయ కమిషన్ వేసి, నివేదికలను వేగంగా తీసుకుని, కేబినెట్ లో చర్చించి, అసెంబ్లీలోనే నిర్ణయం తీసుకున్నామని సిఎం వివరించారు. దీనివల్ల ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు లేకుండా చేశామని సీఎం తెలిపారు. వర్గీకరణకు తీర్మానం చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కొట్లాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సమస్యలు, అభ్యంతరాలను కేబినెట్ సబ్ కమిటీతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సిఎం సూచించారు.

ఎసిబికి చిక్కిన ధరూర్ ఎస్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ వ్యక్తిని కేసు నుంచి తప్పించేందుకు రూ.30వేలు లంచం తీసుకుంటుండగా వికారాబాద్ జిల్లా ధారూర్ ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్‌ను ఎసిబి అధికారులు మంగళవారం పట్టుకున్నారు. ఎసిబి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ గతంలో బషీరాబాద్ ఎస్ఐగా విధులు నిర్వహించాడు. ఇటీవల బదిలీలో భాగంగా ధారూర్‌కు వచ్చాడు. మండల పరిధిలోని నాగసముందర్ గ్రామానికి సంబంధించిన భూ వివాదం కేసు పిఎస్‌కు వచ్చింది. ఈ కేసులో ఓ వర్గానికి మద్దతుగా మరో వర్గానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేస్తానని ఎస్ఐ బెదిరించాడు. అతన్ని రెండ్రోజుల పాటు పిఎస్‌కు రప్పించి, ఇబ్బంది పెట్టాడు. ఈ క్రమంలో అతన్ని కేసు నుంచి తప్పించాలంటే రూ.70వేలు లంచం ఇవ్వాలని ఎస్ఐ డిమాండ్ చేశాడు. దాంతో రూ.30వేలు ఇచ్చేందుకు బాధితుడు ఒప్పుకున్నాడు. అనంతరం ఈ విషయాన్ని బాధితుడు ఎసిబి అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. మంగళవారం ధారూర్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐకి బాధితుడు రూ.30వేలు లంచం ఇస్తుండగా.. ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పిఎస్‌లో ఎస్ఐని ఎసిబి అధికారులు విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్.. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఎస్ఐగా అవార్డు తీసుకోవడం గమనార్హం.

సామ్‌సంగ్‌ను వెనక్కి నెట్టిన వివో..

న్యూఢిల్లీ : భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో వివో అగ్రస్థానంలోకి వచ్చింది. ఇంతకాలం సామ్‌సంగ్ మెజారిటీ వాటాను కలిగి ఉండగా.. ఆ సంస్థను వివో వెనక్కి నెట్టింది. 2024 ఏడాదికి గాను చైనాకు చెందిన వివో సంస్థ 16.6 శాతం మార్కెట్ వాటాతో తొలి స్థానంలో నిలిచిందని ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడిసి) వెల్లడించింది. గతేడాది సామ్‌సంగ్ ఏకంగా 4 శాతం మార్కెట్ వాటాను కోల్పోయి 17 శాతం నుంచి 13.2 శాతానికి పడిపోయింది. మరోవైపు ఆపిల్ 6.4 శాతం వాటాను 8.2 శాతానికి పెంచుకుంది. మోటోరొలా 2.7 శాతంగా ఉన్న తన వాటాను 6 శాతానికి పెంచుకోగా.. వన్‌ప్లస్ మార్కెట్ వాటా 6.1 శాతం నుంచి 3.9 శాతానికి పడిపోయింది. రియల్‌మీ వాటా 12.5 శాతం నుంచి 11 శాతానికి, షావోమీ 12.5 శాతం నుంచి 12 శాతానికి తగ్గింది.

ఇపిఎస్ పెన్షన్ స్కీంకు సవరణలు చేయాలి

హైదరాబాద్ బ్యూరో : ఇపిఎస్ పెన్షన్ స్కీంకు సవరణలు చేయాలని, పెన్షనర్లు గౌరవంగా బతికేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని ఆల్ ఇండియా కన్వీనింగ్ కమిటీ చైర్మెన్ ఎంఎన్ రెడ్డి, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పాలకుర్తి కృష్ణమూర్తి అన్నారు. పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేషనల్ కో ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఈపీఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ బర్కత్‌పురాలోని ఈపీఎఫ్‌కార్యాలయంఎదుటధర్నా నిర్వహించారు.

జిబ్రానిక్స్ నుంచి తొలి యుఎస్‌టి ప్రొజెక్టర్

చెన్నయ్ : ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ జిబ్రానిక్స్ దేశంలోనే తొలిసారి యుఎస్‌టి ప్రొజెక్టర్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. 'జిబ్ పిక్సా ప్లే ప్రో 500' పేరుతో దీన్ని ఆవిష్కరించినట్లు పేర్కొంది. ఇవి గృహాల్లో పెద్ద స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించనున్నాయని ఆ కంపెనీ తెలిపింది. అతి తక్కువ దూరం నుంచే హెచ్‌డి 1080పి నేటివ్ రిసొల్యూషన్‌తో తక్కువ నుంచి 228 సెంటీమీటర్ల స్క్రీన్‌ను పొందవచ్చని వెల్లడించింది. క్వాడ్‌కోర్ ప్రాసెసర్ కలిగిన ఈ ప్రొజెక్టర్ ధరను రూ.69,999గా నిర్ణయించినట్లు తెలిపింది. ఇది ఆన్‌లైన్‌లో లభ్యం అవుతుందని పేర్కొంది.

అన్ని రంగాల్లోనూ మహిళలపై వివక్ష

- సైన్స్‌లో చదవడానికే పరిమితం.. శాస్త్రవేత్తలుగా రాణించడం లేదు
- ప్రొ.ఆదినారాయణ స్మారక సెమినార్‌లో ఎన్‌ఐఎన్ మాజీ డైరెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలు, యువతులు, బాలికలు అన్ని రంగాల్లోనూ వివక్షతకు గురవుతున్నారని, అందులో సైన్స్ రంగం మినహాయింపు కాదని ఎన్‌ఐఎన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మెహతాబ్ ఎస్ బాంజి అన్నారు. సైన్స్ రంగంలో మహిళల సంఖ్య చాలా తక్కువ అని చెప్పారు. ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతులను ఇప్పటివరకు వెయ్యి మందికి ఇవ్వగా.. అందులో మహిళలు 65 మంది మాత్రమేనని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు ప్రొఫెసర్ ఆదినారాయణ వర్ధంతి, అంతర్జాతీయ మహిళ, బాలికల సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ, ఆంధ్ర మహిళాసభ డిగ్రీ కళాశాల సంయుక్తంగా "సైన్స్‌లో మహిళల పాత్ర" అనే అంశంపై మంగళవారం ఓయూలో సెమినార్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల్లో చిన్నప్పటి నుంచే సైన్స్‌పై జిజ్ఞాస పెంచేలా పాఠ్యాంశాలను మార్చాలని కోరారు. మహిళలు సైన్స్ చదవడం వరకే పరిమితం అవుతున్నారని, శాస్త్రవేత్తలుగా రాణించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులు తగిన ప్రోత్సాహం అందివ్వాలన్నారు. నేటికీ భ్రూణ హత్యలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మహిళలు సైన్స్ రంగంలోనూ రాణిస్తే దేశం మరిన్ని అద్భుతాలను సృష్టిస్తుందని చెప్పారు. మహిళల విజయాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. యూనివర్సిటీ, కేంద్ర విద్యాలయాల్లోని పోస్టుల ఎంపికలోనూ మహిళలు లింగ వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సెలక్షన్స్ కమిటీలో మహిళలు ఉండాలని ఆమె సూచించారు.

ఎమ్మెల్సీ ప్రొ. కోదండరామ్ మాట్లాడుతూ.. సమాజంలో మహిళల పట్ల చిన్నచూపు ఉందని, అణచివేత కొనసాగుతోందని చెప్పారు. ఈ అసమానతలను బద్దలు కొడితేనే మరింత మెరుగైన సమాజం సాధ్యమన్నారు. సైన్స్ రంగంలో మహిళల పాత్ర మరింత పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. సైన్స్ చదివిన వారు.. పిహెచ్‌డిలు చేసిన వారు, సైన్స్‌ను బోధిస్తున్న వారు కూడా మూఢవిశ్వాసాలను నమ్ముతున్నారని, ఇది సమాజానికి ఏ మాత్రం మంచిది కాదన్నారు. వాస్తవాలను దాయకుండా నిజం చెప్పడం, అవసరమైతే ప్రభుత్వాన్ని ప్రశ్నించడం సైన్స్ చేయాల్సిన కర్తవ్యం అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా మాట్లాడుతూ.. మహిళలపై లైంగికదాడులు, వివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా సైన్సు కార్యకర్తలు నిలబడాలన్నారు. బాలికలకు పాఠశాల స్థాయిలోనే సైన్స్‌పై ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆంధ్ర మహిళా సభ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ పి.రజిని మాట్లాడుతూ.. పల్లెల్లో మూఢవిశ్వాసాలు కొనసాగుతున్నాయని, వాటికి మొదట బలయ్యేది మహిళలేనని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే గ్రామాల్లో సైన్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జెవివి రాష్ట్ర నాయకులు ప్రొ. ఎ రామచంద్రయ్య, ప్రొ.కట్టా సత్యప్రసాద్, ప్రొ. బిఎన్ రెడ్డి, డాక్టర్ కోయ వెంకటేశ్వరరావు, డాక్టర్ అందే సత్యం, శ్రీనాథ్, ఆనంద్ కుమార్, శ్రీనివాస్, లింగస్వామి, ఆంధ్ర మహిళా సభ ప్రిన్సిపల్ డాక్టర్ కె కరుణాదేవి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వై వసుంధర, డాక్టర్ ప్రమీల, డాక్టర్ సంధ్యారాణి, రాజ్యలక్ష్మి, సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణలో బహ్రెయిన్‌కు సహకరిస్తాం

- ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నైపుణ్య శిక్షణలో బహ్రెయిన్‌కు తెలంగాణ పూర్తి సహకారం అందిస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో బహ్రెయిన్ రాయబారి అబ్దుల్ రహమాన్ అల్ గావుద్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ, అంకుర సంస్థల ఆవిష్కరణ కేంద్రంగా ఉన్న టీహబ్, టీవర్క్స్ లాంటి సంస్థలను బహ్రెయిన్‌లో ఏర్పాటు చేసేందుకు సాంకేతిక సహకారం అందిస్తామని వారికి హామీ ఇచ్చారు. "రాష్ట్రంలో ఏటా రెండు లక్షల మందికి పైగా ఇంజనీరింగ్, లక్ష మంది వరకు సాధారణ గ్రాడ్యుయేట్లు చదువులు పూర్తి చేసుకుంటున్నారు. వీరు తమకు ఇష్టమైన రంగంలో శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు దక్కించుకునేలా స్కిల్ యూనివర్సిటీ సహకరిస్తుంది. ఈ తరహా ప్రయోగం దేశంలో మరే రాష్ట్రంలో జరగలేదు. సింగపూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటిఇ)తో విద్యార్థుల మార్పిడి, బోధనాంశాలను ప్రవేశపెట్టడం పై ఒప్పందాలు చేసుకున్నాం. ఫలితంగా రాష్ట్రంలోని 33 రంగాలకు శిక్షణ అందించేందుకు అవకాశం ఏర్పడింది. విద్యా సంస్థలకు, పరిశ్రమలకు మధ్య స్కిల్ యూనివర్సిటీ వారధిగా పనిచేస్తుంది" అని శ్రీధర్‌బాబు వారికి వివరించారు. విద్య, ఆరోగ్య రంగాలపై తెలంగాణా ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తోందని తెలిపారు. బహ్రెయిన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఈ రంగాల్లో ఉన్న అవకాశాలపై పెట్టుబడులతో ముందుకు రావాలని ఆహ్వానించారు. బహ్రెయిన్ పర్యటనకు రావాల్సిందిగా ఆ దేశ రాయబారి కోరడం పట్ల మంత్రి ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బహ్రెయిన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు మహ్మద్ అల్ కూహెజి, టిజిఐఐసి సిఇఒ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సి-2008 అభ్యర్థులకు కొలువులు

- నేడు ఉత్తర్వులు వచ్చే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిఎస్‌సి -2008 అభ్యర్థులకు కొలువులు రానున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి)లుగా కాంట్రాక్టు పద్ధతిలో వారికి ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు బుధవారం వెలువడతాయని తెలిసింది. రాష్ట్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న దృష్ట్యా ఎన్నికల కోడ్ అమల్లో ఉంది. దీంతో డిఎస్‌సి-2008 అభ్యర్థులకు కొలువులు ఇచ్చేందుకు ఎన్నికల కమిషన్ (ఇసి) కూడా అనుమతి ఇచ్చింది. వారికి ఉద్యోగాలు కల్పించే దస్త్రంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతకం చేశారు. ఇక ఉత్తర్వులు విడుదల కావడమే మిగిలి ఉన్నది. 1,382 మంది అభ్యర్థులకు ఉద్యోగాలు రానున్నాయి. డిఎస్‌సి-2008 అభ్యర్థుల నియామకం పట్ల సోమవారం హైకోర్టులో విచారణ జరిగిన విషయం తెలిసిందే. మూడు రోజుల్లో నియామకాల ప్రక్రియను చేపడమని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి కోర్టుకు నివేదించారు. ఈ నేపథ్యంలో ఆ నియామకాలకు సంబంధించిన కసరత్తును విద్యాశాఖ వేగవంతం చేసింది. ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే వారికి కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్‌లను ఇస్తారు. ఆ జాబితాను 33 జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాధికారి (డిఇఒ)లకు విద్యాశాఖ పంపిస్తుంది. 2008లో డిఎస్‌సిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరీక్ష రాశారు. అప్పుడు తెలంగాణలో పది జిల్లాలున్నాయి. పరిపాలనా సౌలభ్యం కోసం జిల్లాల సంఖ్య 33కు పెరిగింది. దీంతో 33 జిల్లాల ప్రాతిపదికన నియామకాల ప్రక్రియను కలెక్టర్లు, డిఇఒలు చేపడతారు. ఒకవేళ ఉమ్మడి జిల్లాను ప్రాతిపదికగా తీసుకుంటే పాత జిల్లా కేంద్రాల్లోనే వారికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంటుంది. దానివల్ల రాబోయే డిఎస్‌సిపై ప్రభావం పడుతుంది. నిరుద్యోగులకు నష్టం కలుగుతుంది. అందుకని 33 జిల్లాల ప్రాతిపదికన డిఎస్‌సి-2008 ఉద్యోగాలను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. 1,382 మందికి ఎస్‌జిటి కొలువును కాంట్రాక్టు పద్ధతిలో ఇస్తారు. వారికి ఎస్‌జిటిలకు ఇచ్చే మూలవేతనం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హెచ్‌ఆర్ఎ, ఇతర అలవెన్సులు వారికి వర్తించవు. దీంతో వారికి నెలకు రూ.31,040 వేతనం అందుతుంది. హైకోర్టులో తదుపరి విచారణను ఈ నెల 17వ తేదీకి వాయిదా పడింది. అప్పటిలోపు నియామకాల ప్రక్రియను పూర్తి చేసే దిశగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటుంది.

భారత్‌లో నథింగ్ ఫోన్ (3ఎ) సిరీస్ తయారీ

న్యూఢిల్లీ : లండన్ కేంద్రంగా ఉన్న నథింగ్ సంస్థ తన సరికొత్త స్మార్ట్‌ఫోన్ నథింగ్ ఫోన్ (3ఎ)ను సిరీస్‌ను భారత్‌లోనే తయారు చేస్తోన్నట్లు ప్రకటించింది. ఇక్కడి గొప్ప తయారీ వ్యవస్థను అందిపుచ్చుకోవాలని కంపెనీ నిబద్ధతో ఉందని నథింగ్ పేర్కొంది. ఈ కొత్త సిరీస్ ఫోన్లను చెన్నయ్ ఫ్యాక్టరీలో తయారు చేస్తోన్నామని.. ఇందులో 500లకు ఉద్యోగులు పనిచేస్తున్నారని పేర్కొంది. వారిలో 95 శాతం మంది మహిళలే ఉన్నారని తెలిపింది.

ఐఆర్‌సిటిసి లాభాల్లో 13 శాతం వృద్ధి



న్యూఢిల్లీ :ఇండియన్ రైల్వేకి చెందిన ఐఆర్‌సిటిసి ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు సాధించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 13.7 శాతం వృద్ధితో రూ.341.09 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.300 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,115 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన త్రైమాసికంలో 9.8 శాతం పెరిగి రూ.1,225కోట్లకు చేరింది. 2024-25కు గాను రెండో మధ్యంతర డివిడెండ్ కింద రూ.2 ముఖ విలువ కలిగిన షేర్‌పై రూ.3 లేదా 150 శాతం డివిడెండ్‌ను అందించాలని ఐఆర్‌సిటిసిబోర్డు నిర్ణయించింది.

NOTICE
IN THE COURT OF HON'BLE METROPOLITAN SESSIONS JUDGE : AT HYDERABAD
Crl. M.P. No. 177 of 2024
IN
Crl. Appeal No. of 2024
Between :
M/s. Bindu Housing Pvt. Ltd, Rep. by Dr. N. Krishna Prasad ... Petitioner
AND
1. The State of Telangana, P.S., Humayunnagar & 2 Others ...Respondents
NOTICE TO RESPONDENT No. 2
To,
Pakala Anil Kumar Reddy S/o P. Venkat Reddy, aged 52 Years, Occ: Business, R/o. H.No. 2-2-89, Ramngar, Hanmakonda, Warangal.
Sir, Please take Notice that the above Crl. M.P. is filed for the condonation of delay in filing the Criminal Appeal against the judgement passed by the VIth ACMM, Hyderabad acquitting you, in C.C. No. 155 of 2016, dated 12-02-2024. The above said Condone Delay Petition is posted to 20th February, 2025, at 10.30 am at your appearance and Counter. If you failed to attend before the said Court, on the date and time, the matter will be decided as per law.
BY ORDER OF THE COURT
D. Sambashiva Rao,
Advocate
Flat No. 201, Meghamalhar Apts, 2-2-1146/B, St. No. 16, New Nallakunta, Hyderabad - 500044. Cell: 7901254981

In the Court of the 9th Additional District Judge (MACT) at Kovvur, W.G.Dt.
M.V.O.P. No. 60/2023
Between:
1. Chinnam Mery and Others ...Petitioners
AND
1. Sri. Gogula Shankar and Others ...Respondents
Notice to 1st Respondent
1st Respondent:
Gogula Shankar, S/o. Rajam, aged 37 years, Male, Driver of Lorry bearing No. TS 24 T 5111, R/o. D.No. 2-143, Kammarpalle Village, Dahegaon Mandal, Adilabad Dt., Telangana State.
In the above matter you are the 1st Respondents and for your appearance the case was posted to 17-03-2025. On that day you can appear on your own or through an Advocate before the Hon'ble Court at 10.30 A.M. Hence the case is decreed against you in your absence.
(Order of the Hon'ble Court)
KODURI NARASIMHA RAO
Advocate
Kovvur, E.G.Dt., A.P.

In The Court Of The Civil Judge (Senior Civil) Tanuku
H.M. OP.No. 51/2022
Between:
Kadali Srinivas ...Petitioner
And
Kadali (Mamidisetti) Vani ...Respondent
To
Kadali (Mamidisetti) Vani, W/o Srinivas
D/o. Mamidisetti Rama Rao,
D.No.14-45, Sri Nivasam,
P&T Colony, Dilsukhnagar,
Hyderabad,Rangareddy District,
Telangana State
పై నెంబరు గల H.M.OP లో Petitioner కోర్టు ద్వారా మీకు నోటీసును పంపించి ఉన్న మీరు తీసుకోకుండా ఎవైడ్ చేస్తున్నందున సబ్స్టిట్యూట్ సర్వీస్ ద్వారా నోటీసు మీకు తెలియపరుచున్నందున మీరు పై నెంబరు పిటీషన్ వాయిదా ది.03-03-2025వ తేదీన ఉదయం గం. 10-30 ని.లకు స్వయంగా గాని, లేదా మీ తరుపున అడ్వకేట్ గారి ద్వారా గాని కోర్టుకు హాజరై తమ అక్షేపణలు తెలియపరుచుకొనవచ్చును. లేనియెడల సదరు గౌరవ న్యాయస్థానం వారు ఏకపక్షంగా తీర్మానము చేయుదురు అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.
కామన మునిస్వామి
తణుకు
అడ్వకేట్, తణుకు
ది. 11-02-2025
సెల్: 94414 47403

మధ్యప్రదేశ్ ప్రమాదంపై సిఎం రేవంత్ సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో హైదరాబాద్ నాచారం ప్రాంతానికి చెందిన వారు చనిపోయినట్లు సమాచారం అందటంతో వెంటనే అధికారులను అప్రమత్తం చేశారు. అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సాయం అందేలా ఏర్పాట్లు చేయాలని సిఎం ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సిఎం సానుభూతి తెలిపారు.

ఐఎస్ మేక్ రిఫ్రిజిరేషన్ రెవెన్యూలో 34 శాతం వృద్ధి

హైదరాబాద్ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 34 శాతం వృద్ధితో రూ.110.56 కోట్ల రెవెన్యూ సాధించినట్లు ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్ (ఐస్‌మేక్) వెల్లడించింది. ఇదే సమయంలో నికర లాభాలు 39 శాతం పెరిగి రూ.2.81 కోట్లుగా నమోదయ్యాయని ఆ కంపెనీ సిఎండి చంద్రకాంత్ పటేల్ తెలిపారు. ఇంతక్రితం ఏడాది ఇదే క్యూ3లో రూ.1.28 కోట్ల లాభాలు ప్రకటించింది. ఐస్‌మేక్ దేశంలో 50కి పైగా రకాల రిఫ్రిజిరేషన్ పరికరాలను తయారు చేస్తోంది. ఆధునిక కూలింగ్ సొల్యూషన్లు అందిస్తోంది. బలమైన మార్కెట్ డిమాండ్, ఆపరేషనల్ సామర్థ్యాల కారణంగా గడిచిన త్రైమాసికంలో మెరుగైన ఆదాయ వృద్ధిని సాధించినట్లు చంద్రకాంత్ తెలిపారు.

హామీల అమలుకు ప్రజాక్షేత్రంలో నిలదీస్తాం

- ఎమ్మెల్సీ కల్వకుంట కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలకిచ్చిన హామీలు అమలు చేయకుంటే ప్రజాక్షేత్రంలో నిలదీస్తామని రేవంత్ సర్కారును తెలంగాణ జాగృతి అధ్యక్షులు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. మంగళవారం తెలంగాణ జాగృతి మహిళా విభాగం కార్యకర్తలతో ఆమె హైదరాబాద్‌లోని తన నివాసంలో సమావేశమయ్యారు. మహిళలకిచ్చిన హామీలపై ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడం విషయంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ప్రతి మహిళకు నెలకు రూ.2500 చొప్పున ఇప్పటివరకు రూ.35 వేలు బాకీ పడిందని గుర్తుచేశారు. మరిన్ని బస్సులు పెంచి మహిళలకు ప్రజా రవాణాను సులభతరం చేయాలని కోరారు. తులం బంగారం, స్కూటీ హామీ ఏమయ్యాయని ప్రశ్నించారు. మహిళా దినోత్సవంలోపు హామీల అమలుపై కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మహిళలను సీఎం రేవంత్ రెడ్డి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలైనా హామీలు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల పేరుతో ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్న హామీ ఇంత వరకు మొదలు పెట్టనేలేదనీ, సంక్రాంతికి సన్నబియ్యం ఇస్తామని మోసం చేశారని తెలిపారు. వెంటనే పెన్షన్లను రూ.నాలుగు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

బడ్జెట్‌ను పూర్తిగా సవరించాలి

- రాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా కేంద్ర బడ్జెట్
- శ్రామిక, అణగారిన వర్గాలకు తీవ్ర వ్యతిరేకం
- నిధులు తేలేని కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ, పక్కన చెరుపల్లి సీతారాములు తదితరులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర బడ్జెట్ రాష్ట్ర ప్రయోజనాలకు, శ్రామిక, అణగారిన వర్గాలకు వ్యతిరేకంగా ఉందని, దాన్ని పూర్తిగా సవరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో మంగళవారం ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములుతో కలిసి ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. బడ్జెట్‌ను పూర్తిగా సవరించి తగిన పద్ధతుల్లో నిధులు కేటాయింపులు చేసేటట్టుగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. 50 లక్షల 65వేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. శ్రామిక ప్రజల కోసం నిర్దిష్టమైన ప్రతిపాదన లేదన్నారు. దేశవ్యాప్తంగా 30 కోట్లకుపైగా ఉన్న గ్రామీణ ఉపాధి కూలీల కోసం రూ.85వేల కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. వ్యవసాయ రంగానికి పదివేల కోట్లను తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ల చేతుల్లో పెట్టి రైతులను కూలీలుగా మార్చే కుట్రకు మోడీ సర్కార్ పూనుకుందని విమర్శించారు.

రాష్ట్రంలో ఎనిమిది మంది బిజెపి ఎంపిలు ఉండి నిధులు తీసుకురావడంలో విఫలం చెందారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగినా కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్ ఎక్కడా ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు. నిధులు తీసుకురాని కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వారిని ప్రజలే వెంటపడి తరిమికొట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

రాష్ట్ర బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలకు నిధులివ్వాలి

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు జరపడం లేదని జాన్‌వెస్లీ విమర్శించారు. రైతు రుణమాఫీకి పదివేల కోట్లు ఇప్పటికీ కేటాయించలేదన్నారు. రైతు భరోసాకు సంబంధించి అరకొర నిధులు ఇస్తున్నారని తెలిపారు. కూలీలకు భరోసా ఇవ్వడం లేదన్నారు. దళితులకు 12 లక్షల దళిత బంధు ఊసే ఎత్తడం లేదన్నారు. రానున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలకు నిధులు కేటాయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు ఉపయోగపడే విధంగా ఈ రాష్ట్ర బడ్జెట్ ఉండాలని సూచించారు. లేదంటే కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజలు నిరసనలు ఎలా చేస్తున్నారో.. ఇదే పద్ధతిలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సిపిఎం పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి శాసనసభలో మొదటగా బిల్లు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు.

చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. అమెరికాలో ట్రంప్ పాలనలో భారతీయులకు అవమానాలు, అన్యాయాలు జరుగుతుంటే పార్లమెంట్‌లో ప్రధాని మోడీ ఒక్క మాటా మాట్లాడకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, పైళ్ల ఆశయ్య పాల్గొన్నారు.

సమాజంలో అశాంతి కారకులను గుర్తించాలి

- వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సమాజంలో అశాంతి కారకులను గుర్తించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఎఐసిఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మేరకు ఎఐసిఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రామరాజ్యం పేరుతో కొందరు సంఘవిద్రోహ శక్తులు చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై దాడి చేయడాన్ని ఖండించారు. ఆధ్యాత్మికత, భక్తి పేరుతో తాము చెప్పినట్టు నడుచుకోవాలని ఇతరులపై దాడులు చేసే సంస్కృతిని ప్రతి ఒక్కరూ ఖండించాలని సూచించారు. అన్ని మతాల్లోని ప్రజాస్వామిక వాదులు, లౌకిక వాదులు ఒక్కటై మత ఉన్మాదుల దుశ్చర్యలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రంగరాజన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. మతం పేరుతో గతంలో చర్చి పాస్టర్లపై దాడి చేసేవారు, ఇప్పుడు ఏకంగా దేవాలయ అర్చకులపై కూడా దాడులకు తెగబడుతున్నారని తెలిపారు. మతం ముసుగులో ఆధిపత్యం, ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా సంస్థలు స్థాపించుకుని దేశంలో, తెలుగు రాష్ట్రాల్లో శాంతి భద్రతలకు విఘాతం కల్పించేలా ఉన్మాద చర్యలకు పాల్పడుతున్నవారిపై ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని కోరారు. నిరక్షరాస్యులు, చదువు మధ్యలో మానేసినవారు, నిరుద్యోగులు, నేర ప్రవృత్తి, దుందుడుకు స్వభావం కలిగిన యువతీ యువకులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో రహస్యంగా తమ కార్యకలాపాలను విస్తరించుకుంటూ వీరు సమాజంలో అశాంతికి కారణమవుతున్నారని చెప్పారు. భవిష్యత్తులో దేవాలయ అర్చకులపై, చర్చి పాస్టర్లపై దాడులు జరుగకుండా వారికి వెంటనే భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇద్దరిని బలిగొన్న వివాహేతర సంబంధం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వివాహేతర సంబంధం ఇద్దరి ప్రాణాలు బలితీసుకున్న ఘటన ములుగు జిల్లా కన్నాయి గూడెం మండలంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తుపాకులగూడెం (కొత్తూరు) గ్రామానికి చెందిన ఆలం స్వామి(28), ఆలం కిరణ్ భార్య అశ్విని (23)కి కొంతకాలంగా వివాహేతర సంబంధం ఉంది. వారం రోజుల క్రితం స్వామి, అశ్విని ఇద్దరూ కలిసి ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. కిరణ్ పెద్ద మనుషుల మధ్య పంచాయితీ పెట్టి స్వామి వద్ద రూ.మూడు లక్షలు పొందే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. డబ్బులు కట్టాలని ఒత్తిడి చేయగా ఇద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడారు. పోలీసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనులను మోసగించిన కాంగ్రెస్

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసగించిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ నెల 15న సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బిఆర్ఎస్ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు, గిరిజన ప్రముఖులు హాజ రవుతారని చెప్పారు. 16 కోట్ల మంది గిరిజనుల ఆరాధ్యుడు సేవాలాల్ మహారాజ్‌కు ప్రత్యేక గుర్తింపు, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించడం, హైదరాబాద్‌లో ఆయన పేరుతో రూ.25 కోట్లతో సేవాలాల్ మహారాజ్ భవన్ నిర్మాణం, తండాలను గ్రామ పంచాయతీలు గా చేయడం అన్నీ కెసిఆర్, బిఆర్ఎస్ హయాంలోనే జరిగాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గిరిజన కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేయడం లేదనీ, గిరిజనులకు ఓవర్సీస్ స్కాలర్ షిప్పులు ఇవ్వడం లేదనీ, గిరిజన మంత్రిత్వశాఖ గిరిజనులకు ఇవ్వకుండా తన వద్దే పెట్టుకున్నారని సత్యవతి రాథోడ్ విమర్శించారు. గిరిజనులు మాజీ సిఎం కెసిఆర్ పాలనకు, సిఎం రేవంత్ రెడ్డి పాలనకు మధ్య తేడాను గుర్తించాలని కోరారు. మాజీ ఎంపి మాలోత్ కవిత మాట్లాడుతూ గిరిజనుల రిజర్వేషన్లను 10 శాతం పెంచిన ఘనత కెసిఆర్ దేనని తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పాల్గొన్నారు.

పదేళ్ల బిఆర్ఎస్, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా?

- కెటిఆర్‌కు మహేష్‌కుమార్‌గౌడ్ సవాల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పదేండ్ల బిఆర్ఎస్ పాలన, ఏడాది కాంగ్రెస్ పాలనపై చర్చకు సిద్ధమా? అంటూ టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాజీ మంత్రి కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలకడం ఆపేసి... దమ్ముంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలని డిమాండ్ చేశారు. చెల్లి, బావ ఇచ్చిన షాక్‌తో కెటిఆర్‌కు మతి భ్రమించిందనీ, అందుకే ఇష్టమెచ్చినట్టు మాట్లాడుతున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందంపై చర్చకు సిద్ధం కావాలని కోరారు. బిసి కులగణన, ఎస్సి వర్గీకరణ చర్చకు ఎక్కడికి రమ్మన్నా వస్తానని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని స్పష్టం చేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రజలు గుండు సున్నాతో బుద్ధి చెప్పిన విషయం మరిచిపోయారా? అని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ గాడిద గుడ్డు వస్తుందని తెలిసే... బిఆర్ఎస్ ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించలేదని ఎద్దేవా చేశారు. బిఆర్ఎస్ పదేళ్ల విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని సిఎం రేవంత్, మంత్రుల బృందం పునర్వికాసం వైపు నడిపిస్తోందని చెప్పారు. మూడు ముక్కలుగా చీలిన బిఆర్ఎస్... వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో కనిపించబోదని ఆయన పేర్కొన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుతో మాట్లాడుతున్న పూజారి

అర్చకులు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య

- పూజారిని పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై రామరాజ్యం పేరుతో పలువురు దుండగులు దాడికి పాల్పడటం హేయమైన చర్య అని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం అర్చకులు రంగరాజన్‌ను ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావుతో కలిసి ఆయన నివాసంలో మంత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పూజారిపై దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికే పలువురిని అరెస్టు చేశామని, మిగతా వారిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. పూజారి రంగరాజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

- తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి : హరీశ్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన పద్మావతి గోదాసమేత వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఆలయాలకు నిధులు మంజూరు చేయడం లేదన్నారు. కొత్తగా ఒక్క ఆలయాన్ని కూడా అభివృద్ధి చేయలేదని, గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూడా నిలిపివేశారని ఆరోపించారు. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టు కల్లా రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్‌రెడ్డి.. మాట ఇచ్చి మోసం చేశారన్నారు. చబ్బీస్ జనవరికి రైతులందరికీ రైతు భరోసా ఇస్తామని చెప్పినా.. ఇప్పటివరకు పూర్తి చేయలేదని విమర్శించారు. వానాకాలం రైతుబంధు ఎగబెట్టి రూ. ఎనిమిది వేల కోట్లు రైతులకు అందకుండా చేశారన్నారు. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఒడగొట్టారని.. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని, రాబోయే ఎన్నికల్లో కూడా వారికి అవే ఫలితాలు ఇక్కడా వస్తాయని తెలిపారు. ఫిబ్రవరి 11 ప్రామిస్ డే నని.. ఈ ప్రామిస్ డే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఆ డిమాండ్లు కోర్టు తీర్పుకు వ్యతిరేకం

- మంద కృష్ణకు సతీష్ మాదిగ కౌంటర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ముందు ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ పెట్టిన డిమాండ్లు సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎంఆర్‌పిఎస్ ఫౌండర్ నేత దేవని సతీష్ మాదిగ తెలిపారు. గిల్లి పంచాయితీ చేయడం మానుకోవాలని మంద కృష్ణకు సూచించారు. ఎస్‌సి వర్గీకరణ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారమే జరిగిందని ఒక ప్రకటనలో ఆయన అభిప్రాయపడ్డారు. దీన్ని స్వాగతిస్తూనే ఆయన బుడగ జంగాల జనాభా 111 లక్షలకు ఒక శాతం రిజర్వేషన్ ఇచ్చారని తెలిపారు. అదే విధంగా నేతకాని కులం 1.33 లక్షల జనాభాకు ఒక శాతం ఇచ్చి 'డీ' గ్రూప్ చేయమంటూ అడుగుతున్నారని పేర్కొన్నారు. ఇది సుప్రీం కోర్టు తీర్పుకు విరుద్ధమని తెలిపారు. ఆయన సూచన మేరకు 'డీ' గ్రూప్ చేస్తే సుప్రీం కోర్టు వర్గీకరణ అంశాన్ని పక్కపెడుతున్నట్టేనని ఆందోళన వ్యక్తం చేశారు. కుల జనాభా ప్రకారం వర్గీకరణ చేయమంటూ సుప్రీంకోర్టు చెప్పలేదని స్పష్టం చేశారు. ఇప్పటికిప్పుడు రిజర్వేషన్ల సంఖ్యను పెంచడం సాధ్యం కాదని తెలిపారు. రిజర్వేషన్ల స్లాబ్ 50 శాతం ఉన్నందున ఇప్పటికిప్పుడు పెంచడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. మంద కృష్ణ మాటలు, డిమాండ్లు వర్గీకరణకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు.

రిక్తమ్ గ్రూప్ నుంచి జింటర్వ్యూ ఎఐ

- నియామక ప్రక్రియలో ఎఐకి శ్రీకారం
- జెడ్ ఇంటర్వ్యూ ఎఐ సిఇఒ సిద్ధరామ్

ప్రజాశక్తి - హైదరాబాద్

తమ సంస్థ విస్తరణ, వృద్ధి కోసం మరిన్ని నిధులను సమీకరించే యోచనలో ఉన్నామని జింటర్వ్యూఎఐ వ్యవస్థాపకుడు, సిఇఒ సిద్ధరామ్ శింగశెట్టి అన్నారు. ఇప్పటికే దాదాపు రూ.1.70 కోట్ల (2 లక్షల డాలర్లు) ఫండింగ్ సమీకరించామని చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంస్థ సహ వ్యవస్థాపకుడు విజేందర్ జైన్‌తో కలిసి సిద్ధరామ్ మాట్లాడారు. రిక్తం టెక్నలాజీకి చెందిన తమ జింటర్వ్యూఎఐ సంస్థ నియామక ప్రక్రియలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. హెచ్‌ఆర్ రంగంలో ఎఐ ఆధారిత 'జింటర్వ్యూఎఐ'ని ఆవిష్కరించామని చెప్పారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించి టాలెంట్ హైరింగ్‌ను సులభతరం చేయడం ద్వారా సంస్థలు సమయాన్ని, వనరులను ఆదా చేసుకోవచ్చని తెలిపారు. తమ సంస్థ దాదాపు 20కి పైగా కంపెనీలకు నియామక సేవలను అందిస్తుందన్నారు. ఈ ఎఐ 15 పైగా భాషల్లో ఇంటర్వ్యూలు నిర్వహించగలదన్నారు. అందులో అనేక భారతీయ భాషలు కూడా ఉన్నాయని తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి వృద్ధుడి మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యుఘాతంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోనూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనూరు గ్రామానికి చెందిన అంకటి మల్లయ్య (65) గేదె కనిపించడం లేదని వెతుక్కుంటూ వెళ్లారు. అదే గ్రామానికి చెందిన అంకటి రాజయ్య పెరట్లో కూరగాయలు పండిస్తున్నారు. దాని చుట్టూ జీ వైర్ అమర్చి విద్యుత్తు సరఫరా పెట్టారు. అటుగా వెళ్లిన బర్రె విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతపడింది. అదే దారిలో గేదెను వెతుక్కుంటూ వెళ్లిన మల్లయ్య కూడా కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఇందుకు కారణమైన వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని మృతుని కుటుంబ సభ్యులు అధికారులను కోరారు. మందమర్రి సిఐ శశిధర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మల్లయ్య కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు. అంకటి రాజయ్యను రిమాండ్‌కు పంపామని సీఐ వివరించారు.

రమణాచారి నేటి సివిల్ సర్వీస్ అధికారులకు ఆదర్శం

- విద్యాసాగర్ రావు

ప్రజాశక్తి కల్చరల్

అధికార దుర్వినియోగం చేయకుండా పాలనా దక్షత తో తన బాధ్యతలు నిర్వహిస్తూ మానవీయ సంబంధాలుకు ప్రాధాన్యత ఇచ్చిన సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ నేటి ఐ ఎ ఎస్ అధికారులు ఆదర్శం గా తీసుకోవాలి అని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు అన్నారు రాజకీయ నాయకులకు పావులుగా మారితే తదుపరి కాలం లో రాజకీయ నాయకుల తో పాటు జైలు కి వెళ్లాల్సి వస్తుందని ఆయన తెలిపారు రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై వంశీ ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో డాక్టర్ కె వి రమణ జన్మ దిన సందర్భంలో వంశీ రమణ గ్లోబల్ మ్యూజిక్ అవార్డ్ ప్రముఖ గాయకుడు స్వర కర్త రామాచారి కి ప్రదానోత్సవం సభ జరిగింది ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యా సాగర్ రావు అవార్డ్ ను రామాచారికి బహుకరించి మాట్లాడారు దేశ సమైక్యత సమగ్రత కోసం ఐ ఎ ఏస్ ఐ పి ఏస్ లను నాటి కేంద్ర హెూం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఏర్పరఛారు అని రమణాచారి అందుకు తగిన విధం గా తన ధర్మాన్ని నిర్వర్తించేరు అని సర్దార్ బిరుదు కు అయన అర్హుడు అని చెప్పారు రామాచారికి మ్యూజిక్ అవార్డ్ రమణాచారి పేరిట బహుకరించటం బంగారానికి సుగంధం అబ్బినట్లు వుందని అభివర్ణించారు తెలుగు భాష లో సంస్కృతి లో భాగమైన సంగీతం లో నిగ్రహ శక్తి వుందని చెప్పారు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి డాక్టర్ ఎన్ గోపి మాట్లాడుతూ రమణాచారి ఏ పదవి లో వున్నా పదవికి వన్నె తెచ్చారు అని ప్రశంసించారు రమణాచారి సభలకు వెలుగు అన్నారు రామా చారి డాక్టరేట్ కి అర్హుడు అని సంగీత సేవకుడు అని పేర్కొన్నారు సాంస్కృతిక పోషకుడు బొల్లి నేని కృష్ణయ్య దైవజ్ఞ శర్మ తదితరులు తదితరులు పాల్గొన్న సభలో వంశీ రామరాజు స్వాగతం పలికారు డాక్టర్ తెన్నేటి సుధా దేవి నివేదిక సమర్పించేరు తొలుత రామాచారి శిష్య బృందం పాడిన పాటలు ఆకట్టుకున్నాయి

ఫార్మాకు మా భూమిలివ్వం

- మేడిపల్లి, కుర్మిద్ద, నానక్‌నగర్, తాడిపర్తి రైతులు
- వారితో డిసిపి సునీతారెడ్డి సమావేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఫార్మా రద్దు అనిని చెప్పి.. మళ్లీ భూ సేకరణ ఎలా చేస్తారు.. ఫార్మాకు మా భూములివ్వం.. నిషేధిత జాబితా నుంచి మా భూములు తొలగించాలి' అంటూ ఫార్మా భూ బాధితులు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని నక్కర్త మేడిపల్లి, కుర్మిద్ద, నానక్ నగర్, తాడిపర్తి గ్రామాల్లో మరో 2,500 ఎకరాల భూ సేకరణ కోసం రైతులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. దాంతో రెండు రోజుల క్రితం రంగారెడ్డి కలెక్టరేట్‌ను గ్రామస్తులు ముట్టడించారు. తమ భూముల జోలికి రావొద్దని హెచ్చరించారు. ఆ సందర్భంగా ఇబ్రహీంపట్నం ఎసిపి రాజు జోక్యం చేసుకుని రైతులతో మాట్లాడారు. కలెక్టర్‌తో మాట్లాడించే ప్రయత్నం చేస్తానని చెప్పడంతో రైతులు శాంతించారు. ఈ మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నం ఎసిపి కార్యాలయంలో మహేశ్వరం డిసిపి సునీతారెడ్డి ఆధ్వర్యంలో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రైతుల ఆందోళనకు గల కారణాలను ఒక్కొక్క రైతు నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

గత ప్రభుత్వం కందుకూరు, మహేశ్వరం, యాచారం మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో 20 వేల ఎకరాల భూములను ఫార్మా కోసం సేకరించిందన్నారు. ఆ భూములతో తమకు ఎలాంటి సంబంధమూ లేదని, గత ప్రభుత్వంలో ప్రతిపక్ష పాత్రలో ఉన్న నాయకులు తమ గ్రామాలను సందర్శించి.. ఫార్మాకు వ్యతిరేకంగా నిలిచారని చెప్పారు. 20వేల ఎకరాలు మినహా సెంటు భూమి కూడా ప్రభుత్వానికి ఇవ్వొద్దని గతంలో తమకు భరోసా ఇచ్చారని గుర్తు చేశారు. నాడు వాగ్దానం చేసిన నాయకులే నేడు అధికారం లో ఉన్నారని.. ఫార్మా సిటీని రద్దు చేయకపోగా.. ఆ భూములు రైతులకు తిరిగి ఇవ్వకపోగా.. మరో 2,500 ఎకరాలు సేకరిస్తున్నట్టు తమకు నోటీసులు జారీ చేశారని చెప్పారు. ఆన్‌లైన్ రికార్డుల నుంచి భూముల వివరాలు తొలగించడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. భూములు సర్వే చేస్తున్నారని, వాటిని అడ్డుకుంటున్నామని రైతులు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎసిపి కెపివి రాజు, గ్రీన్ ఫార్మా పోలీస్ స్టేషన్ సిఐ కృష్ణంరాజు, ఇబ్రహీంపట్నం సిఐ జగదీశ్వర్, యాచారం సీఐ నర్సింహారావు, భూ నిర్వాసితులు పాల్గొన్నారు.

నా బిడ్డను కోల్పోయాను : లాలునాయక్, కుర్మిద్ద తండా

నా బిడ్డ పెండ్లికి కట్నం ఇవ్వాలి. భూమి అమ్ముడుపోతే కట్నం ఇస్తానని మాటిచ్చిన. ఆత్తింటి వారు వేధింపులు ఎక్కువయ్యాయి. భూమి అమ్ముడుపోవడం లేదు. కట్నం ఇచ్చే పరిస్థితి లేదు. వారి వేధింపులతో నా బిడ్డ ఆత్మహత్య చేసుకుంది. నేను ఎవరికీ చెప్పుకోవాలి. నా బిడ్డకు చిన్న కూతురు ఉంది. ప్రభుత్వం వైఖరితో నా బిడ్డను కోల్పోయాను.

మా భూముల జోలికి రావొద్దు : వెంకట్‌రెడ్డి, నానక్‌నగర్, మాజీ సర్పంచ్

ఫార్మాకు మా భూమికి ఎలాంటి సంబంధమూ లేదు. నిషేధిత జాబితా నుంచి తొలగించాలి. 2500 ఎకరాలు సాగు యోగ్యమైన భూములే. మా అంగీకారం లేకుండా మా భూములను తీసుకునే హక్కు ప్రభుత్వానికి లేదు. మా భూముల జోలికి మాత్రం రావద్దు.

ప్రతి రైతూ అభిప్రాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా : సునీతారెడ్డి, మహేశ్వరం డిసిపి

భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన వ్యక్తం చేయడం సహజం. ఆందోళన శాంతియుతం గా చేసుకోవాలి. అశాంతికి తావు ఇవ్వొద్దు. రాచకొండ సిపి సుధీర్ బాబు సూచనల మేరకు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలి. రైతుల నుంచి అభిప్రాయాన్ని సేకరించాం. కానీ రైతుల నుంచి నేరుగా మాట్లాడితే వారి సాధకబాధకాలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశాం.